క్లుప్తంగా

పెట్రోల్ బంకులకు స్థలాల పరిశీలన



స్థలాలను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

కోవెలకుంట్ల:మండలంలోని రెండు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు సంబంధించి జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ గురువారం స్థలాలను పరిశీలించారు. కోవెలకుంట్ల- జమ్ములమడుగు ఆర్అండ్‌బీ రహదారిలోని గుళ్లదూర్తి సమీపంలో, కోవెలకుంట్ల- బనగానపల్లె రహదారిలోని సొదరదిన్నె వద్ద పెట్రోల్ బంకుల ఏర్పాటుకు యజమానులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు జేసీ ఆయా ప్రాంతాలను పరిశీలించి స్థలాల వివరాలను తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. జేసీ వెంట ఇన్‌చార్జ్ ఆర్ఐ పుల్లయ్య, వీఆర్‌ఓలు లక్ష్మయ్య, మురళి ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: ప్రజా రవాణా సమస్యలపై స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. డిపో పరిధిలోని ఆయా రూట్లలో తిరిగే బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు అందజేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. 9959225798 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు.

ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

డోన్ టౌన్: ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. గురువారం యూటీఎఫ్ నాయకులతో కలిసి పాతపేట జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఉపయోగపడే విధంగా రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంచి మార్కులు తెచ్చుకుని తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, కౌన్సిల్ సభ్యులు లతీఫ్, బొజ్జన్న, సర్వజ్ఞ మూర్తి, అంజనప్ప, చంద్రమోహన్, మధు, సాలయ్య, విశ్వనాథ్‌రెడ్డి, రాజేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాలు

డోన్ టౌన్: ఆర్టీసీ కార్గో, పార్శిల్ సర్వీసుకు సంబంధించి డోర్ డెలివరి మాసోత్సవాలు ఈ నెల 20 నుంచి 2025 జనవరి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021 నుంచి వినియోగదారుల సౌకర్యం కోసం కొరియర్, పార్శిల్ డోర్ డెలివరి సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఏపీలో 87 ముఖ్య పట్టణాల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉందని, అందులో డోన్ ఒకటన్నారు. చిన్న కవరు నుంచి 50 కేజీల వరకు అతి తక్కువ రేట్లకు డోన్ చుట్టుపక్కల 10 కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ సౌకర్యం ఉందన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే మాసోత్సవాల్లో ప్రజలకు వీటిపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ



నివాళులర్పిస్తున్న కాటసాని తిరుపాల్ రెడ్డి

అవుకు:మండలంలోని సుంకేసుల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కైప పెద్ద తులసి రెడ్డి, చిన్న తులసిరెడ్డి తల్లి రామ సుబ్బమ్మ (85)అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుమారులు, మనువడు ఉపసర్పంచ్ కైప పార్థసారథిరెడ్డిని పరామర్శించారు.

హిజ్రాలకు చీరలు పంపిణీ



డోన్: క్రిస్మస్ ముందస్తు వేడుకల్లో భాగంగా పట్టణంలోని హిజ్రాలకు పౌడర్ ఫ్యాక్టరీ యజమాని ఆశీర్వాదం ఆర్థిక సహాయంతో చీరలు పంపిణీ చేశారు. ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ వారికి చీరలు అందజేశారు.

రైతులకు భరోసా ఏదీ..?

- పెట్టుబడి సాయం ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- ఏడాదికి రూ.20 వేలు అందజేస్తామని ఎన్నికల సమయంలో హామీ
- ఖరీఫ్ ముగిసి రబీ వచ్చినా అందని సాయం
- అసహనం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



రబీలో వేసిన మొక్కజొన్న పంట

బనగానపల్లె రూరల్: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతన్నలకు కష్టాలు తప్పడంలేదు. తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పేరుతో ఏటా పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామన్న కూటమి నాయకలు మాటలు నీటి మూటలుగా మారాయి. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో పెట్టుబడి సాయం వస్తుందని ఎదురు చూసిన రైతులకు నిరాశే ఎదురైంది. పోనీ రబీలో అయినా ఆదుకుంటుందని భావించినా ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో అప్పులు చేసి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయంగా ఏటా రూ.13500 ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేసి అండగా నిలిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవ పథకంగా పేరు మార్పు చేయడం తప్ప రైతులకు ఏమీ చేయలేదు. పేరు మార్పులో చూపించిన వేగాన్ని రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో చూపించడం లేదు. ఇప్పటికే పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం తన వాటను ప్రతి రైతుకు రూ.2 వేలను వారి ఖాతాల్లో జమ చేస్తోంది. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రబీ సాగుకు పెట్టుబడి ఎలా?

ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంటకు తగిన గిట్టుబాటు ధర లభించలేదు. ఇటు కంది పంట వేసిన రైతులకు పంట దిగుబడి రాకపోవడంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. రబీలో బోరు బావుల్లో నీరున్న రైతులు, ఎస్సార్‌బీసీ ప్రధాన కల్వ వెంట ఉన్న ఆయకట్టు రైతులు మళ్లీ రబీ సీజన్‌లో వరి, మొక్కజొన్న, జొన్న తదితర ఆరుతడి పంటలను సాగు చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విత్తనాలు, ఎరువుల కొనుగోలు, ట్రాక్టర్ బాడుగలకు అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో అయినా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు పెట్టుబడిసాయం అందించాలని కూటమి ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

బనగానపల్లె నియోజకవర్గంలో రబీసాధారణ సాగు విస్తీర్ణం

మండలం	సాధారణ సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
బనగానపల్లె	2600
అవుకు	3211
కోవెలకుంట్ల	8707
సంజామల	10216
కొలిమిగుండ్ల	4075

గత వైఎస్సార్‌సీపీ పాలనలో ...

గత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందించి ఆదుకున్నారు. పీఎం కిసాన్ పథకం కింద రూ.6 వేలు, రైతు భరోసా పథకం కింద రూ.7.500 మొత్తం ఏడాదికి రూ. 13, 500 విడతలవారీగా రైతన్నల బ్యాంకు ఖాతాలకు జమ అయ్యేది. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందజేసి అండగా నిలిచారు. వ్యవసాయ సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు సాగుపై సలహాలు, సూచనలు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని, రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయని దిగులు చెందుతున్నారు. అసలు పథకం అమలుపై స్పష్టత ఇవ్వాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

పెట్టుబడిసాయం అందించాలి



టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడిసాయం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు వెంట నే ఇవ్వాలి.రబీ సీజన్‌లో చాల మంది రైతులు బోరుబావులు,ఎస్సార్‌బీసీ కాల్వల వెంట వరి,మొక్కజొన్న, శనగ తదితర పంటలను సాగు చేసు కుంటున్నారు.ఇలాంటి సమయంలో ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– శంకర్‌రెడ్డి,రైతు, జిల్లెల్ల

ఖరీఫ్‌లో నష్టమే మిగిలింది



ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంటవేశాను,కురిసిన అకాల వర్షాలు,తూఫాన్ల ప్రభావంతో పంట దిగుబడి తక్కువగా రావడం జరిగింది. వచ్చిన వరి ధాన్యానికి కూడ గిట్టుబాటు ధరలేదు.దీంతో నష్టానికి విక్రయించుకోవాల్సివచ్చింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే ఎంతో మేలు ఉండేది. కూటమి ప్రభుత్వం రైతులకు అందిస్తామన్న అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు వెంటనే విడుదల చేస్తే రబీలో పెట్టుబడి కోసం రైతులకు కొంతైన ఉపశమనం ఉంటుంది.

– సురేష్‌రెడ్డి రైతు, తిమ్మాపురం

చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి



చేనేత కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

బనగానపల్లె రూరల్: చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అన్నారు. మండలంలోని నందివర్గం గ్రామంలో చేనేత సహకార సంఘాన్ని గురువారం సాయంత్రం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత సంఘం కార్మికులతో సమావేశం నిర్వహించారు. పలువురు చేనేత కార్మికులు తమకు నూలును ప్రభుత్వమే అడ్వాన్స్‌గా ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో చేనేత ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏడీ నాగరాజారావు కోరారు. గ్రామంలో చేనేత కార్మికుల స్థితిగతులపై కలెక్టర్ ఆరా తీశారు. నందివర్గం చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ ఈశ్వరయ్య, మాజీ చైర్మన్ చంద్రకళ, తహసిల్దార్ నారాయణరెడ్డి, ఆర్ఐ రాఘవేంద్ర చేనేత కార్మికులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ క్యాంప్ ప్రారంభం



రాష్ట్రస్థాయి కోచింగ్ క్యాంపులో క్రీడాకారులు

డోన్: పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో ఈనెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు బాలికల బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి కోచింగ్ క్యాంప్‌ను నిర్వహించనున్నారు. వచ్చే నెలలో ముంబయిలో జరగనున్న నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన రాష్ట్ర క్రీడాకారిణిలకు ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు. జాతీయ క్రీడాకారులైన డీఎస్పీ శ్రీనివాసులు, ఆటగాళ్లు కేతు మౌలా, రషీద్, ప్రకాష్, కామేష్, డేవిడ్, రామ్‌కీ, రామ్మోహన్, ఇంతియాజ్ సహకారంతో ఫ్రెండ్లీ ప్రాక్టీస్ మ్యాచ్‌లను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా క్రీడాకారిణీలకు ఆటలో మెలకువలను నేర్పిస్తారు. క్రీడాకారిణుల కోసం వసతి, భోజన, ప్రయాణ సదుపాయాలను డీఎస్పీ శ్రీనివాసులు కల్పిస్తున్నారు.

ఉద్యోగులకు సమయపాలన ముఖ్యం



బనగానపల్లె సచివాలయం-2లో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. గురువారం మండలంలోని పలుకూరు సచివాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయాలను తనిఖీ చేశారు. పలుకూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ పనితీరును పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలపై మెడికల్ ఆఫీసర్ మౌనికను ఆరా తీశారు. అలాగే బనగానపల్లె పట్టణంలోని 2,3,4వ సచివాయాలకు వెళ్లి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రత్యేక ఆధార్ శిబిరాలను పరిశీలించారు. శుక్రవారంతో పాటు ఈ నెల 26, 27, 28 తేదీల్లో ప్రత్యేక ఆధార్ సెంటర్లు పనిచేస్తాయని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న సారాను చూపిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐలు

డోన్ రూరల్: నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ సోమశేఖర్‌రావు తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో దాడులు నిర్వహించామన్నారు. డోన్ మండలం ఎర్రగుంట్ల గ్రామంలో సారా విక్రయిస్తున్న ఉలవ రామసుబ్బమ్మను అరెస్టు చేశామన్నారు. అలాగే ప్యాపిలి మండలం నేరేడుచెర్ల గ్రామానికి చెందిన కాడి వెంకటచలపతి, బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లి గ్రామానికి చెందిన నీనావత్ గోలాయనాయక్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి ముగ్గరి నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. 700 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఎక్సైజ్ సీఐ లక్ష్మణదాస్, ఎస్ఐ దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ రంగస్వామి, ఉమాకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వారంలోగా పందులను తరలించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్

కొలిమిగుండ్ల: గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులను వారం రోజుల్లో బయటకు తరలించాలని తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి, ఎంపీడీఓ ప్రసాదరెడ్డి స్పష్టం చేశారు. జనావాసాలు, పొలాల్లో పంటలను ధ్వంసం చేస్తున్నాయని మండల సర్వసభ్య సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సూచించడంతో తీర్మాణం చేశామన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రైతులు, పంచాయతీ కార్యదర్శులు, పందుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆరుగాలం కష్టించి పండిస్తున్న పంటలను పందులు ఇష్టానుసారంగా నాశనం చేస్తున్నాయని రైతులు వాపోయారు. ఎన్నోసార్లు పందులను బయటకు తరలించాలని చెప్పినా పట్టించుకోలేదన్నారు. వారం రోజులు గడువు ఇస్తున్నామని ఆలోగా గ్రామాల్లో ఎక్కడా పందులు కనిపించకుండా చేయాలని అధికారులు సూచించారు. ఖాళీ చేయకపోతే తామే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒకే చోట పందులను ఏర్పాటు చేసుకునేందుకు ఎకరా ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామని తహసీల్దార్ చెప్పారు. పందుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఏఎస్ఐ గోవిందునాయక్, ఈఓఆర్డీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో అయ్యప్ప భక్తులు

బేతంచెర్ల: నంద్యాల రహదారిలోని అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజ మహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పూల రథంపై వినాయకుడు, అయ్యప్పస్వామి, సుబ్రమణ్యేశ్వరస్వామి ఉత్సవవిగ్రహాలను కొలువుంచారు. చిన్నారుల కోలాటాలు, దీపోత్సవం, అయ్యప్పస్వామి నామస్మరణ నడుమ ఆలయం నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి కేరళ వేదపండితుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, పూజలు చేశారు. అయ్యప్పమాలధారులతో పాటు భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గుండా జయచంద్రకుమార్, బచ్చు సుబ్రమణ్యం, గురుస్వాములు చంద్ర శేఖర్, చిన్ని కృష్ణ, మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

కోవెలకుంట్ల: మండలంలో 18 ఏళ్లు నిండి ఇప్పటి వరకు ఓటు హక్కులేని యువతీ యువకులు కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఓటు హక్కులేని యువకులు ఆయా గ్రామాల బూత్ లెవల్ అధికారుల వద్ద ఫారం- 6 ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. మ్యానువల్ పద్ధతిలోనైనా లేదా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

కోలుకోలేక యువకుడి మృతి

బనగానపల్లె రూరల్: భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యకు యత్నించిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు నందివర్గం ఎస్ఐ వెంకట సుబ్బయ్య తెలిపారు. శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన కేడం మధుగోపాల్(33)కు మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన మేనత్త కూతురు మౌనికతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. నెల క్రితం మౌనిక భర్తతో గొడవపడి పుట్టింటికి వచ్చేసింది. బుధవారం భార్యను చూసేందుకు వచ్చిన మధుగోపాల్ ఆమె కాపురానికి రావడం లేదన్న మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించి కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స నుంచి కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతుడి తల్లి కేడం లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకుడు అజాంబిక్

బనగానపల్లెరూరల్:ఉపాధ్యాయులకు జూనియర్ అధ్యాపకులుగా పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజాంబిక్ అన్నారు. గురువారం మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఉన్నత పాఠశాల ప్రాంగణాల్లో కొత్తగా ప్రారంభించనున్న జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులుగా సీనియర్ ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఏకీకృత సర్వీస్ నిబంధనల సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు. ఎస్టీయూ నాయకులు అమీర్, వెంకటేశ్వరరెడ్డి, గోపాలకృష్ణుడు, శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

మారని ఆర్టీసీ డ్రైవర్ల తీరు



రోడ్డుపైనే నిలిపిన ఆర్టీసీ బస్సు



బస్టాండ్ ముందు నిలిచిన వాహనాలు

కొలిమిగుండ్ల: ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిసినా ఆర్టీసీ డ్రైవర్ల తీరులో మార్పు రావడం లేదు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన రహదారిలోనే ఉంది. మూడు జిల్లాలకు సరిహద్దులో ఉండడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుంది. లక్షలు వెచ్చించి ఆర్టీసీ బస్టాండ్ నిర్మించినా కొన్ని డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు ప్లాట్‌ఫారంలోకి రావడం లేదు. ప్రధానంగా బనగానపల్లె డిపో నుంచి తాడిపత్రికి ప్రతి రోజు 12 సర్వీసులు మేర తిరుగుతుంటాయి. రాకపోకలు సాగించే సమయంలో బస్సులను బస్టాండ్‌లో నిలపకుండా రోడ్డుపైనే ఆపడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు దాటుకుని బస్సుల కోసం వచ్చే క్రమంలో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జమ్మలమడుగు డిపో బస్సులు క్రమం తప్పక లోపలికి వస్తుంటాయి. ఆ సమయంలో బనగానపల్లె, ఇతర డిపో బస్సులు రోడ్డుకు అడ్డుగా ఉండడంతో బస్సులతో పాటు ఇతర వాహనాలు ఆగిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. బనగానపల్లె, తాడిపత్రి, కల్యాణదుర్గం,. ధర్మవరం తదితర డిపో బస్సుల కోసం ప్రయాణికులు సైతం రోడ్డుపైనే వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బస్సులను ప్లాట్‌ఫారంలోకి వచ్చేలా చేయాలని పలు మార్లు ప్రయాణికులు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదు. పైగా డిపో తరపున కంట్రోలర్ లేకపోవడంతో ఏ బస్సు ఎప్పుడు వస్తోందో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.

ఘనంగా రైల్వే విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం



:సన్మానం అందుకున్న సీనియర్ పెన్షనర్లు

డోన్ రూరల్: పట్టణంలోని మర్రి రాఘవయ్య భవనంలో గురువారం రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. 73 ఏళ్లు నిండిన పెన్షనర్లను సన్మానించారు. ముఖ్య అతిథిగా జనరల్ సెక్రటరీ రామక్రిష్ణమాచార్యులు హాజరయ్యారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. ప్రభుత్వ అవసరాల కోసం కూల్చిన పెన్షనర్స్ ఆఫీస్‌లకు ప్రత్యామ్నాయంగా వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ ప్రెసిడెంట్ నారాయణ, సెక్రటరీ కె.విద్యాసాగర్, డివిజనల్ ప్రెసిడెంట్ ప్రసాద్‌రావు, డోన్ అసోసియేషన్ ప్రెసిడెండ్ చలపతిరావు, రామచంద్రరావు, కార్యదర్శి రంగస్వామి, ట్రెజరర్ తిరుపతయ్య పాల్గొన్నారు.

వ్యవసాయంలో సాంకేతికత అవసరం



కేవీకేలో ఆవుల పెంపకం యూనిట్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బనగానపల్లె: కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు సాగులో సంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించాలని ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ అన్నారు. గురువారం మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)ను ఆయన సందర్శించారు. విత్తనోత్పత్తి ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించారు. కలుగోట్ల, గుండపాపల గ్రామాల్లో సాగు చేసిన శనగ, మినుము, కంది విత్తనోత్పత్తి ప్రదర్శన క్షేత్రాలను సందర్శించారు. అనంతరం కేవీకేలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు నూతన సాంకేతికపై అవగాహన పెంచుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం కేవీకేలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన వరి పంట, వానపాముల ఎరువు తయారీ కేంద్రం, పాలీహౌస్, సీడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సురేష్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవిగౌడ్, లక్ష్మీప్రియ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలపై అర్జీల స్వీకరణ

బనగానపల్లెరూరల్: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని.. రైతుల సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నందివర్గం, పలుకూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భూములకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా రైతులు అర్జీల రూపంలో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి 45 రోజుల్లో పరిష్కారం చూపిస్తామని తెలిపారు. పలుకూరు గ్రామంలో 27 అర్జీలు, నందివర్గం గ్రామం నుంచి 10 మంది రైతులు భూ సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రాఘవేంద్ర,వీఆర్వోలు అమరేష్, షరీఫ్, ప్రసాద్, సర్వేయర్లు వెంకటేష్‌నాయక్,స్వాతి,రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన



కోవెలకుంట్లలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

కోవెలకుంట్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షా భారత జాతికి క్షమాపణ చెప్పాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని స్మారక కొండారెడ్డి గ్రంథాలయ ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు సుధాకర్, జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు కరీంబాషా, ప్రజా సంఘాల నాయకులు ఓబులసు, రెడ్డిపల్లె ఓబయ్య పాల్గొన్నారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి

డోన్ రూరల్/డోన్ టౌన్: పట్టణంలోని గుత్తి రోడ్డులో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజినేయులు, పట్టణ కార్యదర్శి మోటారాముడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అంబేడ్కర్‌ను అవమానిస్తే దేశం సహించదని, మంత్రి స్థానంలో ఉండి అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. ఆయన్ను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నాయకులు నారాయణ, ప్రభాకర్, వరదరాజులు పాల్గొన్నారు. హోంశాఖ మంత్రి అమిత్‌షా పదవిలో కొనసాగే అర్హత లేదని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు నాగరాజు, శ్రీకాంత్, ఎస్ఏ చిన్నరహిమాన్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడారు.